ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

నవంబర్ 2013

₹10



# సుబోధ



**భక్తుడు:** సృష్టి, స్థితి, లయలనే లీలలను జగన్మాత నిర్వహిస్తోంది. ఇదంతా ఆమె ఇష్టం. కానీ పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం. ఇందులో మా ప్రాణాలే పోతున్నాయి.

**శ్రీరామకృష్ణులు :** నువ్వు ఎవరివి? అమ్మే సర్వమూ అయి ఉంది. ఆమెను తెలుసుకోనంత వరకే 'నేను, నేను' అంటూ ఉంటావు. 'నేను ఎవర్ని' అంటూ ఈ 'నేను'ను అన్వేషించు. 'నేను' అనేది ఎముకలా? లేక మాంసమా? లేక రక్తమా? లేక ప్రేవులా? 'నేను'ను వెదకుతూపోయినప్పుడు 'నేను'ను కనుగొంటావు. అంటే, లోపల భగవంతుడి శక్తి కంటే వేరుగా మరేమీ లేదు. ఉన్నది 'నేను' కాదు, 'ఆయనే'. ఈ 'నేను'ను పూర్తిగా త్యజింపలేం. కాబట్టి ఈ 'నేను'ను భగవంతుడి దాసుడిగా పడి ఉండనివ్వు. 'నేను భగవంతుడి భక్తుడను, భగవంతుడి బిడ్డను, భగవంతుడి దాసుడను' అనేటటువంటి అహం మంచిది. కామినీ కాంచనాలలో అనురక్తమై ఉన్న 'నేను'– అపరిపక్వమైన 'నేను'. అలాంటి 'నేను'ను పరిత్యజించాలి.

కామినీ కాంచనాలు ఒక విధమైన మద్యం లాంటివి. మద్యపానం చేసేవారు చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా మాట్లాడతారు.

**భక్తుడు:** మహాశయా! సూర్యలోకం, చంద్రలోకం, నక్షత్రలోకం ఇవన్నీ నిజంగానే ఉన్నాయంటారా?

**శ్రీరామకృష్ణులు:** వాటి గురించి అంతగా తల పగలగొట్టుకోవడం ఎందుకు? మామిడి తోటకు పళ్ళు తినడానికి వచ్చావు. అంతేకాని, తోటలో ఎన్ని మామిడి చెట్లు ఉన్నాయి, ఎన్ని లక్షల కొమ్మలు ఉన్నాయి. ఎన్ని కోట్ల ఆకులు ఉన్నాయి అంటూ లెక్కించడం వల్ల ప్రయోజనం ఏమిటి? నేను తోటకు మామిడి పళ్ళను తినడానికి వచ్చాను, పళ్ళు తిని పోతాను.

అయితే చైతన్యం కనుక ఒకసారి జాగృతమైనట్లయితే, భగవంతుణ్ణి ఒకసారి తెలుసుకోగలిగినట్లయితే, నిరర్థక విషయాలను తెలుసుకోవాలన్న ఇచ్ఛ జనించదు.

భగవంతుడిపై మనస్సును నిలుపు. చైతన్యం జాగృతమవుతుంది. భగవంతుణ్ణి హృదయాంతరాళాల నుండి ప్రార్థించినట్లయితే ఆయన పట్ల మనస్సు నిలుస్తుంది. ఆయన పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలుగుతుంది. ❖

**శ్రీరామకృష్ణ ప్రభ**
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద**
సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

ఆధ్యాత్మిక అమృతవాహిని
# శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 70 సంచిక: 11 నవంబర్ 2013



**యత్కటాక్ష సముపాసనా విధిః**
**సేవకస్య సకలార్థ సంపదః ।**
**సంతనోతి వచనాంగ మానసైః**
**త్వాం మురారి హృదయేశ్వరీం భజే ॥**

ఏ దేవి కటాక్ష వీక్షణమున సేవకులకు సకలార్థ సంపదలు లభించునో, అట్టి మురారి హృదయేశ్వరి అయిన లక్ష్మీదేవిని మనోవాక్కాయములచే త్రికరణశుద్ధిగా సేవించెదను.

– శ్రీకనకధారాస్తోత్రమ్

# స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత



స్వామి వివేకానంద భారతదేశ సనాతనత్వానికీ, అధునాతనత్వానికీ అనుసంధాన కర్త. ఆయనలోని సమతుల్యత, ఠీవి నిరుపమానం. అసమానమైన ఆత్మవిశ్వాసం, కార్యదక్షత, నిర్విరామ క్రియాశీలత కలిగియున్న ఈ మహనీయుడు భారతదేశాన్ని పురోగమనగతిలో పయనింపజేయగల ధీరుడు.

మనకు సంక్రమించిన ప్రాచీన సంస్కార సంపదను తలచుకొని మనం గర్వపడే అవకాశాన్ని వివేకానంద మనకు సంప్రాప్తింపజేశారు. ఆయన మన బలహీనతల్నీ, లోపాల్నీ మరుగుపరచకుండా తేటతెల్లంగా బహిర్గతం చేశారు. మనం మన లోపాలను సవరించుకోవాలనే ఉద్దేశంతోనే ఆయన వాటిని ఎత్తి చూపించారు.

స్వామీజీ రచనలు, ప్రవచనాలు మనందరినీ ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆధునిక జాతీయ ఉద్యమ వ్యవస్థాపకుడు, సారథిగా కూడా పరిగణింపదగినవారు స్వామీజీ. జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేతలందరూ స్వామీజీ నుండి స్ఫూర్తిని పొందినవారే.

స్వామీజీ రచనల్లో, భాషణలలో భారతదేశం, ప్రపంచ దేశాల సమస్యల గురించి సమగ్రమైన వివరణలున్నాయి. కాబట్టి ఆయన బోధనలు ఈనాటికీ నూతనత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ స్వామీజీ సమస్త భారతజాతిని ప్రభావితం చేశారు. నేటి యువత స్వామీజీ ఇచ్చిన అమూల్యమైన విజ్ఞాన, వివేక సంపదల నుండీ, ఉత్సాహ ఉద్దీపనల నుండీ ప్రయోజనం పొందగలరని నా విశ్వాసం. ❖

– పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

# లోపలి పేజీల్లో...


4 సంపాదకీయం
భారతావని బంగారు కిరణాలు

6 గోరుముద్ద
సాంకేతిక సంకేతాలు

7 అజ్ఞాన తిమిరనాశని! జ్ఞాన ప్రకాశని!!

8 భజ గోవిందమ్... భజ గోవిందమ్
భోగాల అంచునే బాధలు!

11 వివేకానంద సూక్తి సుధ, వివేకానంద క్విజ్

12 ఇంటికి దీపం

13 ఇతరములన్నియు నడమంత్రములే...

14 పరిప్రశ్న

15 ఆచార వ్యవహారాలు-అంతరార్థాలు
సాష్టాంగమంటే...

16 దయాసాగరి జగద్ధాత్రి

17 మూగజీవాలకూ ప్రేమమూర్తే...

18 నా విజయ రహస్యం

19 ధీరవాణి
వ్యక్తిత్వమే అత్యంత కీలకం

20 సాటి లేని స్వామీజీ మానవతావాదం

22 వివేక దీప్తి
వస్తు విజ్ఞానం నుంచి వ్యక్తి విజ్ఞానానికి

24 సంకల్పశక్తితో సాధిద్దాం!

26 మాటలు... చేతలు

28 కథే స్ఫూర్తిగా...

29 మారాలి... మన రాజకీయ సంస్కృతి

31 ముందుకు సాగిపో!

33 నా చిన్నప్పుడు...

34 భగవద్గీత - సద్గుణ సుధ
భక్తిని అలవరచుకోవడం

36 బొమ్మల కథ
చిదంబరేశుని పదార్చకుడు


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

## శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే (పోస్టల్ పిన్‌కోడ్‌తో సహా) వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్


SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com


'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారా చెల్లించవచ్చును.

# భారతావని బంగారు కిరణాలు

**శర్వరీ దీపక శ్చంద్రః ప్రభాతో దీపకో రవిః ।**
**త్రైలోక్య దీపకో ధర్మః సుపుత్రః కుల దీపకః ॥**

'రాత్రికి వెలుగు చంద్రుడు. పగటికి వెలుగు సూర్యుడు. ముల్లోకాలకూ వెలుగు ధర్మం. వంశానికి వెలుగు సుపుత్రుడు'. లోకానికి వెలుగునిచ్చేది ధర్మమని సుభాషితం చెబుతోంది. మరి నేడు అవినీతి, అన్యాయాలనే అంధకారంతో అలముకొన్న ఈ లోకానికి ధర్మమనే వెలుగునిచ్చేది ఎవరు?

రామకృష్ణ మిషన్ నిర్వహించిన ఉన్నత పాఠశాల విద్యార్థుల సమావేశంలో భారతరత్న అబ్దుల్ కలాం మాట్లాడుతూ... "మన దేశంలో అవినీతి పెచ్చుమీరిపోతోంది. ఎక్కడ చూసినా అన్యాయాలు, అక్రమాలు, అవినీతి స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ అధర్మాలను అణచడానికి ఏం చేయాలి?" అని విద్యార్థులను ప్రశ్నించారు. అందుకు విద్యార్థులు ఒక్కొక్కరూ లేచి 'ప్రజా శ్రేయస్సును కాంక్షించే నిస్వార్థపరులైన నాయకులు కావాలనీ; నిజాయతీపరులైన ప్రజాప్రతినిధులు అవసరమనీ; ప్రతీ ఉద్యోగి తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలనీ; ప్రతీ పౌరుడు సామాజిక స్పృహతో వ్యవహరించాలనీ...' ఇలా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఆలోచనాత్మకమైన విద్యార్థుల సమాధానాలను విని డాక్టర్ కలాం చాలా సంతోషించారు. అయితే ఆయన తన అభిప్రాయం చెబుతూ.. "ఈ సమాజంలో అవినీతి, అధర్మాలను అరికట్టడానికి మీరిచ్చిన సూచనలు సరైనవే. కానీ అన్నింటి కన్నా ముందు అవినీతి నిర్మూలన మీ ఇంటి నుండే మొదలవ్వాలి. అందుకు సరైన ఆయుధాలు మీరే. అది ఎలా అంటే ఉదాహరణకు మీ తండ్రి లంచం తీసుకొని, ఆ డబ్బుతో మీకు మంచి బట్టలు, ఆటవస్తువులు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు కొంటే 'ఆ అవినీతి సొమ్ముతో కొన్న వస్తువులను మేము వాడబోమ'ని మీరు చెప్పగలగాలి; అలాగే 'ఇతరులను మోసం చేసి సంపాదించిన సొమ్ముతో పంచభక్ష్య పరమాన్నాలైనా సరే అవి మాకు వద్ద'ని మీరు ధైర్యంగా నిరాకరించగలగాలి; 'కుటిలబుద్ధితో కోట్లను సంపాదించి నిర్మించిన ఇంద్రభవనాల్లో అశాంతితో జీవించడం కన్నా, శాంతిగా పూరింటిలో జీవించడం మేల'ని మీరు నిర్భయంగా చెప్పగలగాలి; 'అక్రమార్జనతో విలాసవంతమైన జీవితం గడపడం కన్నా సాధారణ జీవన విధానమే ఉత్తమమ'ని మీరు కృతనిశ్చయంతో చెప్పగలగాలి... ఇలా మీరు ఎప్పుడైతే అధర్మ మార్గంలో నడుస్తున్న తల్లితండ్రులపై నైతిక బలాన్ని ప్రదర్శిస్తారో అప్పుడు మాత్రమే సమాజంలో సంపూర్ణంగా అవినీతి ద్వారాలు మూతబడతాయి".

"అయితే, మీలో ఎంతమంది మీ తల్లితండ్రులను అలా అడగగలరు?" అని డాక్టర్ కలాం ప్రశ్నించగానే ఆ సమావేశంలో ఉన్న సుమారు వెయ్యి మంది బాలబాలికలూ తమ సుముఖతను తెలుపుతూ చేతులెత్తారు. అప్పుడు వారితో 'అవినీతిని నిర్మూలించడానికి మేమంతా కృషి చేస్తామ'ని ప్రతిజ్ఞ చేయించారు కలాం. అలా భారతరత్న కలాం కలకాలం చెరిగిపోని రత్నాల్లాంటి మాటలతో ఆ పసిహృదయాలను స్పందింపజేశారు. నిజంగా దేశంలోని విద్యార్థులంతా డాక్టర్ కలాం సూచనలను ఆచరణలో పెట్టగలిగితే మరో రామరాజ్యం ఆవిర్భవిస్తుంది.

అయితే, పసిహృదయాలలో ఆ స్ఫూర్తిజ్వాల నిరంతరం జ్వలించాలంటే మహాత్ముల జీవితాలే వారికి ఆదర్శం కావాలి. అందుకు బాల్యంలోనే ఆత్మశ్రద్ధ, ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసం ప్రదర్శించిన కఠోపనిషత్తులోని నచికేతుడు, భాగవతంలోని ప్రహ్లాదుడు, నేటి నరేంద్రుడు లాంటి ఆదర్శ బాలురు చూపిన వెలుగుబాటలో పయనించాలి.

**తండ్రి వక్రబుద్ధిని సవరించిన తనయుడు:** నచికేతుని తండ్రి అయిన వాజశ్రవసుడు విశ్వజిత్‌యాగం చేశాడు. ఆ యాగం పూర్తయిన తరువాత తనకున్న సమస్త సంపదనూ దానం చేయాలన్నది నియమం. కానీ లోభవశుడైన వాజశ్రవసుడి బుద్ధి వక్రీకరించింది. తన వద్ద ఉన్న బక్కచిక్కిన, వట్టిపోయిన, ఎందుకూ పనికిరాని ముసలి ఆవులను దానం చేస్తున్నాడు. తండ్రి చేస్తున్న అన్యాయాన్ని చూసిన నచికేతుడు, 'తండ్రీ! నేను కూడా మీకు సంపదనే. మరి నన్ను ఎవరికి దానం చేస్తారు. మన పూర్వీకులు ధర్మ మార్గాన్ని అనుసరించి ఎన్నో దానధర్మాలు చేశారు. చెట్టూ చేమల లాగా పుట్టి గిట్టడం కన్నా మనిషిగా ధర్మవర్తనులై ప్రవర్తించాలి' అని తండ్రి తప్పును పరోక్షంగా ఎత్తిచూపాడు. అంతేకాదు 'నిన్ను ఆ యమునికి దానం ఇస్తున్నాను' అన్న తండ్రి మాటను నిజం చేయకపోతే తండ్రికి అపకీర్తి కలుగుతుందని నచికేతుడు, సాక్షాత్తూ యముని దగ్గరకు వెళ్ళాడు. నచికేతుడు తన శ్రద్ధ విశ్వాసాలతో, వివేక వైరాగ్యాలతో యముణ్ణి మెప్పించి, ఆత్మజ్ఞానం పొందడంతో పాటు, వంశానికి ఘనకీర్తిని సంపాదించిన సుపుత్రుడు.



ధర్మం పట్ల ఉన్న శ్రద్ధ వల్ల నచికేతుడు, తన తండ్రిని సత్యపథంలో నడిపించగలిగాడు. అందుకే స్వామి వివేకానంద

నచికేతుణ్ణి శ్లాఘిస్తూ..."నచికేతునికి ఉన్నటువంటి శ్రద్ధను మనం అలవరచుకోవాలి. మనిషికీ, మనిషికీ మధ్య గల భేదం శ్రద్ధలో తారతమ్యమే గానీ వేరొకటి కాదు. మనలో శ్రద్ధ లోపించడమే నేటి మన ఈ దుఃస్థితికి కారణం. ఇప్పుడు మనందరికీ కావలసింది ఆత్మశ్రద్ధ. ఈ శ్రద్ధ వల్ల అఖండశక్తి వస్తుంది. అప్పుడే మహత్తర కార్యాలను సాధించగలం" అని సూచించారు.

**తండ్రి అజ్ఞానం... తనయుని విజ్ఞానం:** ప్రహ్లాదుని తండ్రి అయిన హిరణ్యకశిపుడు అజ్ఞాన, అహంకారాలకు నిలయం. ఈ లోకంలో తన కన్నా శక్తిమంతుడు వేరెవరూ లేరనీ, ప్రతి ఒక్కరూ తననే పూజించాలనీ, తన నామాన్నే స్మరించాలనీ శాసనాలు చేసిన శ్రీహరి ద్వేషి – హిరణ్యకశిపుడు. అజ్ఞానంతో తండ్రి, శ్రీహరిని దూషిస్తూ ఉంటే ప్రహ్లాదుడు, హిరణ్యకశిపునితో "ఓ తండ్రీ! అజ్ఞాన అహంకారాలకు లోనై అనంత శక్తిమంతుడైన ఆ శ్రీహరిని ద్వేషించడం తగదు. విష్ణుభక్తి లేనివాడి జీవితం తోలుతిత్తితో సమానం. గుడ్డివాడికి వెన్నెల లాంటిది, చెవిటి వాడికి శంఖధ్వని లాంటిది, లోభికి సంపద లాంటిది. పందికి పన్నీరు లాంటిది. అందువల్ల అజ్ఞానం వీడి శ్రీమన్నారాయణుని సేవించి తరించండి" అని హితవు పలికాడు.

కుమారుడి నీతివచనాలను సహించలేని హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడై ప్రహ్లాదుణ్ణి వధించమంటూ భటులను శాసించాడు. భటులు ప్రహ్లాదుణ్ణి క్రూరమృగాలతో తొక్కించారు, కత్తులతో పొడిచిహింసించారు, కొండపై నుండి తోయించారు. విషాన్ని త్రాగించారు. ఇలా భటులు ఎన్నో విధాలుగా హింసిస్తున్నప్పటికీ ఆ బాలుడు చలించ లేదు. తండ్రి అజ్ఞానాన్ని పారద్రోలడానికి ప్రహ్లాదుడు కష్టాలన్నింటినీ ఆత్మశక్తితో, విష్ణు భక్తితో అధిగమించి బాల భక్తునిగా చిరకీర్తిని గాంచాడు.



**నిర్భయమే ఆ బాలుని ఆయుధం:** నరేంద్రుని తండ్రి విశ్వనాథ్ దత్తా ప్రఖ్యాత న్యాయవాది. వ్యాజ్యం విషయమై విభిన్న కులాల వారు ఆయన దగ్గరకు వస్తూండేవారు. ఆ రోజుల్లో ఇంటికి వచ్చే అతిథులకు పొగత్రాగడానికి హుక్కాను ఏర్పాటుచేసేవారు. అయితే ఆ కాలంలో కుల పట్టింపుల కారణంగా కులాలవారీగా వేరు వేరు హుక్కాలను ఏర్పాటు చేసేవారు. ఈ కుల పట్టింపులు బాలుడైన నరేంద్రుడికి ఎంతమాత్రమూ ఇష్టముండేవి కాదు. ఒక కులంవారు వాడిన హుక్కాతో ఇంకొక కులంవారు పొగత్రాగితే ఏమవుతుంది? ప్రాణాలు పోతాయా? అని అనుకున్నాడు.

ఒకరోజు నరేంద్రుడు విభిన్న కులాలవారు వాడిన ఒక్కొక్క హుక్కాతో తాను పొగత్రాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన తండ్రితో నరేంద్రుడు "నాన్నా! వివిధ కులాలవారు వాడిన ఈ హుక్కాలతో పొగత్రాగి చూశాను. అయినా నాకేమీ కాలేదు, నా ప్రాణాలేమీ పోలేదు" అని అన్నాడు. నరేంద్రుని విచక్షణా జ్ఞానానికీ, విశాలబుద్ధికీ విశ్వనాథ్ దత్తా ఎంతగానో సంతోషించాడు.

తరువాత కాలంలో స్వామీజీ "బాల్యం నుండీ నిర్భయత్వమే లేకపోతే, నా జేబులో చిల్లిగవ్వ కూడా లేకుండా ప్రపంచమంతా చుట్టి రావడానికి సాహసించేవాడిని కాదు" అని అన్నారు.

నేటి బాలబాలికల్లో సత్యసంధత, శ్రద్ధ, విశ్వాసం, నిర్భయత్వం, నిస్స్వార్థం, దేశభక్తి, త్యాగం, సేవ లాంటి సుగుణాలు అలవడాలంటే పాఠ్యాంశాలలో మహనీయుల జీవితాల్లోని స్ఫూర్తిదాయకమైన సంఘటనలను పొందుపరచాలి. ఆ లేత మనస్సుల్లో ఉత్తేజకరమైన భావాలు అంకురించేలా బోధించాలి.

'స్త్రీలను తల్లిగా భావించేవాడు, పరుల సంపదను తృణంగా పరిగణించేవాడు, ప్రతి మనిషినీ తన ప్రతిరూపంగా భావించే వాడు మాత్రమే నిజమైన విద్యావంతుడు' అని తన బాల్యంలో ఉపాధ్యాయుడు చెప్పిన విషయాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని స్వామీజీ జీవితాంతం గుర్తుచేసుకునేవారు.

మన దేశంలో అధర్మమనే అంధకారం అంతరించి, ధర్మమనే వెలుగు ప్రసరించాలంటే నేటి బాలబాలికలు నచికేతుని సత్యనిష్ఠ, ప్రహ్లాదుని భక్తిశ్రద్ధలు, నరేంద్రుని నిర్భయత్వం అలవరచుకోవాలి. భారతదేశం దివ్య ప్రభలతో ప్రకాశించాలన్న స్వామీజీ కలలను సాకారం చేయడానికి నవకోమల పుష్పాల్లాంటి భావిపౌరులు సన్నద్ధం కావాలి.

స్వామీజీ ఆశాజ్యోతుల్లారా! లేవండి! ధర్మపథంలో నడిచి దివ్య ప్రభలను దేశమంతా విరజిమ్మండి! మహోన్నత భారతదేశానికి నిజమైన వారసులమని నిరూపించండి! ❖



'శ్రద్ధ' - ఇది ఒక అద్భుత పదం. దురదృష్టవశాత్తు ఈ శ్రద్ధ భారతదేశం నుండి దాదాపుగా అదృశ్యమై పోయింది. నచికేతునికున్న శ్రద్ధ మనలో ప్రవేశించాలి. అప్పుడే అన్నీ సమకూరుతాయి. - స్వామి వివేకానంద

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2274**

* * *